# తామరాకు


యస్. వివేకానంద

ఉద్యోగంలో ఎదుర్కొనే బాసిజం, అవమానాలు తట్టుకోలేని వ్యక్తి ఒకరైతే, బాస్‌ని ఎలా కాకా పట్టాలో తెలిసిన వ్యక్తి మరొకరు. ఉద్యోగ జీవితాలపై ఇద్దరు రచయితలు రాసిన కథలు ఇవి. ఒకటి సీరియస్, మరొకటి కామెడీ...

‘‘ఈ సెల్‌ఫోన్లు విరివిగా వాడకంలోకొచ్చాక... అధికారులకు విధి నిర్వహణ దుర్భరంగా తయారైంది...’’ మనసులో మాట బైటపెట్టాడు సీనియర్ సిటిజన్ రంగారావు.

‘‘అవునవును. టెక్నాలజీ పెరిగి దేశం పురోగమిస్తోందంటే ఇదే మరి!’’ పెదవి విరిచాడు వి.ఆర్.ఎస్. తీసుకున్న ఓ అధికారి.

‘‘అన్నింటికీ తొందరే! ప్రతిదానికీ పరుగులే. నిదానంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుని పనిచేయించటమనేది కనుమ



రుగైంది...'' రంగారావు మాటల్లో విసుగు ధ్వనించింది.

''అవున్సార్!... ఇది స్పీడు యుగం...''

''స్పీడూలేదు... పాడూ లేదు! అంతా కన్ఫ్యూజన్. వినే ఓపిక... ఆలోచించే తీరిక లేకపోవడమే. అంతకుమించి మరేంలేదు. మా రోజుల్లో పనులు ఇలాగే జరిగాయా?'' చిరుకోపం ద్యోతకమైంది రంగారావు మాటల్లో.

''యధారాజా.. తథా ప్రజా అంటే ఇదేనండీ..'' నవ్వేడు వి.ఆర్.ఎస్. తీసుకున్న పెద్దమనిషి. ఈయన గారి పేరు సదానందం. పేరుకు తగినట్టే ఎప్పుడూ చిరుమందహాసం చేస్తుంటాడు. అదేమంటే... నవ్వు ఆరోగ్యమంటాడు. ఓ టానిక్‌లా పనిచేస్తుందంటాడు. అంటే నవ్వనివారంతా అల్పాయుష్కులని అతగాడి వుద్దేశ్యం కాకపోవచ్చు.

''ఆమధ్య పేపర్లో వచ్చింది సదానందం గారూ... ఓ గవర్నమెంటు ఆఫీసరు.. పబ్లిగ్గా ఆఫీసులోనే వురేసుకున్నాట్ట!...'' అంటూ జరిగిన వాస్తవాన్ని చెప్పడం ప్రారంభించాడు రంగారావు.

***

రాత్రి పది గంటలు దాటాక అలసిపోయి ఇల్లు చేరుకున్నాడు గౌతమ్ కుమార్. రాగానే బట్టలైనా విప్పకుండా సోఫాలో రిలాక్సయ్యాడు.

''జ్యూసేదైనా ఇచ్చేదా'' శ్రీమతి అడిగింది.

''మరికాస్సేపట్లో భోజనం చెయ్యాలిగా... ఇప్పుడేమీ వద్దులే'' భార్య ముఖంలోకి అదోలా చూస్తూ షర్ట్ జేబులోని సెల్ తీసి పక్కనే వున్న ప్లగ్ పాయింట్‌లో ఛార్జ్‌కోసం ఉంచాడు.

''ప్రసన్నా! టీ.వీ. వాల్యూమ్ తగ్గించు. అలసిపోయి వచ్చిన డాడీకి విసుగ్గా వుంటుంది...'' పదిహేనేళ్ళ కొడుకుతో అంది రమ్య.

ఇంతలో సెల్ రింగైంది.

చేతిలో అందుకుని ''హలో సార్.. మీరా... చెప్పండి సార్.. ప్లీజ్..'' రెస్పాండైన గౌతమ్ కుమార్ అవతలి స్వరం బాస్‌దని గుర్తించాడు.

''వాట్ మేన్. పది గంటలయిందో లేదో అప్పుడే పెళ్లాం పక్కలో దూరి రొమేన్సా? ఇక్కడేమో మేము మినిస్టర్ గారితో చీవాట్లు తింటున్నాం. నువ్వేమో హాయిగా ఇంటికెళ్లిపోయి హేపీగా వున్నావ్'' బాస్ దండకం చదివాడు.

ఫోన్లో బాస్ లాంగ్వేజ్ వింటూ నొచ్చుకున్నాడు గౌతమ్ కుమార్. అసహ్యంగా మాట్లాడుతున్నా ఏమీ అన్లేని పరిస్థితి. తానేమో సబార్డినేట్! ఉదయం ఎనిమిదింటికి ఆఫీసుకెళ్ళి రాత్రి పదింటికి ఇల్లు చేరుకున్నా... నిష్టూరాలు, నిందలే! ఛ! హోప్లెస్ లైఫ్.. విసుక్కున్నాడు. కాదు తిట్టుకున్నాడు మనసులోనే. తను మాత్రం కష్టపడడం లేదూ? శ్రమించి అలసిపోవడం లేదూ? టెన్షన్‌కి గురవడం లేదూ?

''వాట్‌మేన్... మాట్లా ్వేం?'' బాస్ దబాయింపు.

''చెప్పండి సార్...'' పాన్ని దిగమింగుతూ కూల్‌గా అన్నాడు గౌతమ్ ..మార్.

''ఆ టెండర్ ఫైలు గురించేనయ్యా మంత్రిగారు అడుగుతోంది. ఆయన బావమరిదికి వర్క్ ఎలాట్‌మెంట్ ఆర్డర్స్ వెళ్లాయా అని నిలదీస్తున్నాడు...''

ఛ! వెధవ బ్రతుకు. అందరూ నిందించేవారే. అంతా దూషించేవారే.

జీతం ఇచ్చేది కేవలం ఎనిమిది గంటల చాకిరీకి! పని చేయించుకోవడం మాత్రం రాత్రింబవళ్ళు. వాట్ ఎ పిటీ!? ఇలా ఎన్నాళ్ళు... ఎన్నేళ్ళు..?

''వింటున్నావా గౌతమ్. నేను గొంతు చించుకుంటున్నా నువ్వు సైలెంట్‌గా వున్నావంటే ఏమిటర్థం? స్పీకాన్ - మంత్రిగారు మండిపడుతున్నారు. బండ బూతులు తిడుతున్నారు. నువ్ వెంటనే బయల్దేరి ఆఫీసుకు రా. ఉన్నపళంగా రావాలి'' ఆర్డర్ జారీచేసి సెల్ కట్ చేశాడు బాస్.

ప్రజాప్రతినిధులకు వేళాపాళా ఏముంది? వారి పనులు అయ్యేవరకూ వెంటబడి సతాయిస్తూనే వుంటారు. డబ్బు తింటారు... దాంతోపాటు మనుష్యుల్నీ తింటారు... అనేసి గొణుక్కుంటూ కనీసం ముఖమైనా కడుక్కోకుండా ఆఫీసుకు బయల్దేరాడు మళ్లీ!

***

''అయ్యవారొచ్చేవరకూ అమావాస్య ఆగదంటే ఇదే! నువ్వు ఆర్చుకు తీర్చుకొచ్చేసరికి పెట్టవలసిన గడ్డి పెట్టి... నోటికొచ్చినట్టల్లా తిట్టి మినిస్టరు గారెళ్లిపోయారు. అవతల ఎక్కడో ఆయనకు పబ్లిక్ మీటింగ్ వుందట...'' బాస్ కస్సుమన్నాడు గౌతమ్ కుమార్‌ను చూడగానే.

''ఈవేళప్పుడు మీటింగేమిటి సార్...'' నివ్వెరపోయాడు.

''రాజకీయ నాయకులంటే... అంతే! ఇలాగే వుంటుంది మరీ. అర్ధరాత్రీ అపరాత్రీ అని వుండదు. ఎప్పుడు సమయం దొరికితే అప్పుడే వారి కార్యక్రమం...'' చిద్విలాసంగా రివాల్వింగ్ ఛెయిర్లో అటూ ఇటూ తిరుగుతూ మాట్లాడాడు బాస్ గౌరీపతి.

వళ్లు మండిపోయింది గౌతమ్ కుమార్‌కి. ఇలాంటప్పుడు చస్తూపడుతూ తాను రావడం దేనికి?

గౌతమ్‌కుమార్ మనోభావాలను పసికట్టాడో ఏమో ''కూల్‌డౌన్ గౌతమ్. మనం పబ్లిక్ సర్వెంట్లం! ఇరవై నాలుగ్గంటలూ అవసరాల ఆధీనంలో వుండాలి. మనం చేసేది వ్యాపారమైతే ఇష్టమొచ్చినప్పుడు.. అభిమతం మేరకు చేయచ్చు.. అండ్రస్టాండ్...'' చిచ్చుకొట్టాడు బాస్ గౌరీపతి ఐ.ఎ.ఎస్.

యాభైయ్యేళ్లొచ్చినా.. పాతికేళ్ళ సర్వీసు పూర్తయినా... ఆఫీసర్ హోదా వెలగబెడుతున్నా... ఇంకా అండ్రస్టాండ్ కాకపోవటమేమిటి? శబ్దం రాకుండా పళ్లు కొరికేడు గౌతమ్‌కుమార్.

''సార్.., వాటీజ్ నెక్ట్స్?'' బాస్ ముఖంలోకి చూడటానికి మనస్కరించక తలదించుకుని అడిగాడు.

''లెటజ్ కారిట్-ఎ-డే'' విరగబడి నవ్వాడు గౌరీపతి.

బాసుగాడు ఎందుకు నవ్వినట్టో అర్థంకాక క్వశ్చన్ మార్క్ ముఖం పెట్టేడు గౌతమ్ కుమార్.

***

సచివాలయంలో వుద్యోగం అంటేనే కత్తిమీద సాము! అందులోను క్రింది స్టాఫ్ సంగతేమోగాని గజిటెడ్ రాంక్ నుంచి పైవారంతా గజగజలాడిపోతుంటారు.

ఏ నిముషానికి ఏం ఉపద్రవం ముంచుకొస్తుందో... మంత్రులు ఎప్పుడు ఏ ఫైలు కావాలని తొందరపెడతారో అర్థంకాదు.

ఆఫీసర్లు ఫైళ్ళుచ్చుకుని పేషీల చుట్టూ పరుగులు ప్రదక్షిణాలు తప్పవు.

కింద తరగతి ఉద్యోగులంటే తేనెతుట్టె. కదిపితే కుడతాయ్. పెన్‌డౌన్ స్ట్రయికులు... ధర్నాలు.. నల్ల బ్యాడ్జీల ధారణ... వారిలో యూనిటీ వుంది.

ఎటొచ్చీ ఆఫీసర్ల కేడర్లోనే వచ్చిన చిక్కంతా. ఎవరికివారే యమునా తీరే! ఎవరి లాబీయింగ్ వారిది. పైవరి అండదండలకోసం నిత్యమూ పాకులాటే. ఒకరిని చూస్తే మరొకరికి గిట్టిచావదు. గీర్వాణాలు అధికం! కోఆపరేషన్ కోఆర్డినేషన్ మృగ్యం!

ప్రజా ప్రతినిధులు సైతం వీరిని పుల్లిస్తరాకుల్లా చూస్తారు. ఛీ! ఛీ! అంటూ చీదరించుకోవడం సహజం.

ఎవరు ఏమన్నా... ఎన్నన్నా... పళ్లు యికిలించుకుంటూ ... చేతులు పిసుక్కుంటూ.. ఫైళ్లు చంకన పెట్టుకుని చాకిరీ చెయ్యటానికే అలవాటుపడ్డారు.

కాదుకూడదని ఎవరైనా తలెగరేస్తే... దూరంగా ఎక్కడికో విసిరేస్తారు. పెళ్లాం పిల్లలు అలోలక్ష్మణాని ఏడవాల్సి వస్తుంది. చెట్టుకొకరు పుట్టకొకరుగా మిగిలిపోవాల్సి వస్తుంది. ఇదంతా ఎందుకులెమ్మనేసి శాంతమే భూషణంగా ... బిళ్ల జవాన్లా బ్రతకడం!

ఎవరిదగ్గరా కాఫీ కూడా ఆశించని అధికారి గౌతమ్ కుమార్. సిన్సియర్ ప్లస్ హానెస్ట్ వ్యక్తి! జీతం తప్ప మరో సంపాదన ఎరుగడు. ఆఫీసే స్వర్గం అన్నట్టుగా పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాడు.

ముక్కుసూటిగా వ్యవహరించే గౌతమ్ కుమార్ అంటే పైఅధికారులందరికీ చిన్నచూపే! లౌక్యం తెలీని మనిషి! అవినీతిపరుడు కాకపోవడమే అతనికున్న మైనస్ పాయింట్.

***

సచివాలయంలో మనుష్యులతోపాటు ఫైళ్లూ పరుగెడుతుంటయ్. రాత్రింబవళ్లు మీటింగులు. కిందికీ పైకీ తిరగడాలు. ఫైళ్లు అధికారులు గుంజీలు తీస్తుంటారు. పురోగతి మాట దేవుడికే తెలియాలి.

గౌతమ్ కుమార్ తన కేబిన్లో కూర్చుని ఫైళ్లు చూడటంలో నిమగ్నమైనాడు. అప్పటికి మధ్యాహ్నం రెండు గంటలు దాటుతోంది. లంచ్ చేయటానిక్కూడా వ్యవధి లేక పేరుకుపోయిన ఫైళ్లు వెరిఫై చేయటంలోనే తలమునకలవుతున్నాడు.

ఇంతలో ఫోన్ రింగ్ అయింది.

''హలో..''

''గౌరీపతి మాట్లాడుతున్నాను.''

''నమస్తే సార్.. చెప్పండి...''

''ఫోన్లో చెప్పడం కాదు. నువ్వా కాన్ఫిడెన్షియల్ ఫైల్ తీసుకుని వెంటనే నా ఛాంబర్‌కి రా!''

ఫోన్లో బాస్ లాంగ్వేజ్ వింటూ నొచ్చుకున్నాడు గౌతమ్ కుమార్. అసహ్యంగా మాట్లాడుతున్నా ఏమీ అనేని పరిస్థితి. తానేమో సబార్డినేట్! ఉదయం ఎనిమిదింటికి ఆఫీసు కెళ్ళి రాత్రి పదింటికి ఇల్లు చేరుకున్నా... నిష్టూరాలు, నిందలే! ఛ! హోప్లెస్ లైఫ్.. విసుక్కున్నాడు. కాదు తిట్టుకున్నాడు మనసులోనే.

"మీ లంచ్ అయిందా సార్..."

"నువ్వొకడివి. ఆకలి మనిషివి! మినిస్టర్ గారు నిప్పులు తొక్కిన కోతిలా గంతులేస్తున్నారు. లంచ్ డిన్నర్ కలిసి ఒకేసారి చేయచ్చు! నువ్వు వచ్చెయ్."

రిసీవర్ పెట్టేసిన గౌతమ్‌కుమార్ రెండు చేతులతో తల పట్టుకున్నాడు. ఎదురుగా వున్న గ్లాసులో నీళ్లు గటగటా తాగాడు.

చేతులో ఫైల్‌తో సెక్రటరీ ఛాంబర్‌వేపు వేగంగా నడిచాడు.

"కమాన్ కమాన్! ఆ ఫైలేదీ... ఇన్నాళ్లయినా దీన్ని సి.ఎం. గారికి ఎందుకు పంపలేదు? సరే... నువ్వెళ్ళి మినిస్టర్ గారిని కలు. ఫైలు చూపించు. కోరితే ఫైలు ఆయనకిచ్చెయ్. ఆయనే సి.యంని కలుస్తాడు. గో...గో..." గౌరీపతి తొందర చేశాడు.

"ఇద్దరం కలిసి వెళితే బాగుంటుందేమో..?"

"నేను ఇంతకుముందే పి.ఎ.తో మాట్లాడాను. నువ్వెళ్లు చాలు..."

గౌతమ్ కుమార్‌లో దడ మొదలైంది.

"డోన్ట్ డిలే.. హరీఅప్..." మెడబెట్టి బైటికి గెంటినట్టున్నయ్ గౌరీపతి మాటలు.

ఛాంబర్లోంచి సర్రున బైటికొచ్చాడు.

మంత్రిగారేమో హాట్‌హాట్‌గా వున్నారు. ఫైలేమో డిలే అయింది. సెక్రటరీ వెంట రావడం లేదు.

పులి బోన్లోకి వెళ్లబోయే మేకలా వుంది గౌతమ్ కుమార్ పరిస్థితి.

పి.ఎ. తనను చూడగానే లోపలికెళ్లమంటూ సైగ చేశాడు.

"ఆఁ! రావయ్యా డెప్టీ సెక్రటరీ. పిలిస్తేగాని రావా ఏం?"

ఆది ఆప్యాయతో... వెటకారమో అర్థంకాని గౌతమ్ కుమార్ వెకిలిగా నవ్వాడు.

కూర్చోటానికి ధైర్యం చాలక నిలబడే వుండిపోయాడు. వినయం వుట్టిపడేలా విష్ చేశాడు.

నాలుగు మంచి మాటలు చెప్పడం... మషాలా మాటల్లో దట్టించటాలు... కాకాపట్టడాలు చేతనైచావదు.

"నేనడిగిన ఫైలేదీ..."

చేతులు వున్న దాన్ని నమ్రతతో అందించాడు.

ఇంగ్లీషులో వున్నదాన్ని చదవలేకనో ఏదో "ఇందులో ఏముందో అదైనా చెప్పు?" గుడ్లురిమేడు మంత్రి.

గొంతు తడారినట్టయింది. గౌతమ్ కుమార్‌కి మాట పెగల్లేదు.

"అద్సరే... సి.యం. గారి సంతకంకోసం ఫైలు ఎందుకు పంపలేదు..? ఆఁ!?" మీసం దువ్వాడు.

నోట మాట కరవైంది.

ఇన్నాళ్లూ ఫైలు ఛీఫ్ సెక్రటరీ గారి వద్దనే వుందనే యదార్థం చెప్పేందుకు సాహసించలేకపోయాడు.

"నెల తిరగ్గానే వేలకువేలు జీతాలు. కార్లు ఫోన్లు అలవెన్సులు.. అన్నీ కావాలి. కానీ ఫైళ్లు మాత్రం కదలవ్. నెలల తరబడి నిద్రపోతుంటాయ్. నీ రూల్స్ ఎవడిక్కావాలయ్యా. పన్లు కావాలయ్యా పన్లు! ఇష్టమొచ్చినట్టు కాగితాల మీద బరికితే లాభం లేదు. మీలాంటి యూస్‌లెస్ ఫెలోస్ వుండబట్టే యంత్రాంగం నత్తనడక నడుస్తోంది. ఎందుకయ్యా మీరంతా? జనాభా లెక్కకా? గెటవుట్..."

మంత్రిగారి దీవెనలు గౌతమ్ కుమార్ హృదయాన్ని బాధపెట్టాయి. గాయపర్చినయ్.

ఫైలు గిరవాటేసి "మంచిగ నే చెప్పినట్టు వ్రాసి పట్రా..." ఉగ్రుడయ్యేడు మంత్రి. తాచులా బుసకొట్టాడు.

కిందపడిన ఫైలు వంగి అందుకుని గిర్రున తన కేబిన్ చేరుకున్నారు. అంతా కలిసి తనను బలిపశువును చేశారు. తన తప్పు ఏమీ లేకపోయినా తాను నిందకు గురయ్యాడు.

తన కేబిన్లోకి నడుస్తూ తన అనుమతి లేకుండా ఎవ్వరినీ లోపలికి పంపవద్దని స్టెనోకి చెప్పాడు.

అవమానభారంతో మనసు సలసల కాగుతోంది. ఎన్ని తిట్లు? ఎంత పరాభవం? ఇన్నేళ్ల సర్వీసులో ఎన్నడూ ఇలా జరగలేదు. గుండె మండిపోతోంది. తనమీద తనకే అసహ్యం వేసింది. ఇలాంటి బ్రతుకు దేనికన్పించింది.

తల అడ్డంగా ఆడించి ఓ నిర్ణయానికి వచ్చినవాడిలా నిట్టూర్చాడు.

అర్ధగంట సేపు గౌతమ్ కుమార్ కేబిన్లో నిశ్శబ్దం నృత్యం చేసింది.

స్టెనో ఇంటర్‌కమ్‌లో బజరిచ్చినా రెస్పాన్స్ లేదు. ఇక లాభంలేదని స్టెనో తానుగా తలుపు తోసుకుని కేబిన్లోకొచ్చాడు.

అప్పటికే అంతా అయిపోయింది.

గౌతమ్ కుమార్ శవం సీలింగ్ ఫాన్‌కి వేలాడుతూండటం చూసిన స్టెనో నిర్ఘాంతపోయాడు. లిప్తపాటు చేష్టలుడిగినవాడైనాడు.

ఆ తర్వాత కెవ్వున కేకపెట్టాడు.

స్టెనో కేక విని ఏం జరిగిందోనని సెక్షన్లో పనిచేసే వారంతా కేబిన్లోకొచ్చారు. అక్కడి దృశ్యాన్ని చూసి నివ్వెరపోయారు.

గౌతమ్ కుమార్ ఆత్మహత్య విషయం సచివాలయమంతా క్షణాల్లో తెలిసిపోయింది.

చీఫ్ సెక్రటరీ... సెక్రటరీ... సెక్యూరిటీ ఆఫీసరు వగైరా పెద్దలంతా వచ్చి వాలేరు.

ఫేన్‌కి వేలాడుతున్న శవాన్ని నలుగురూ పట్టి కిందికి దించారు.

"ప్రాణం పోయింది సార్.. హి ఈజ్ డెడ్..." ముక్కు దగ్గర వేలుపెట్టి చెప్పాడు సెక్యూరిటీ ఆఫీసరు.

'జేబులో లెటరేదో వున్నట్టుందే...' అంటూ దాన్ని పైకితీశాడు. చీఫ్ సెక్రటరీకి అందించాడు.

హఠాత్ పరిణామానికి కారణం ఏమై వుంటుందో ఎవ్వరి వూహకీ అందలేదు.

మంత్రిగారి దూషణ కారణంగా ఆత్మాభిమానం దెబ్బతిన్న నేను ఇక బతక్కూడదని నిర్ణయానికొచ్చాను. ఆత్మహత్యే సరైన శిక్షగా తోచింది. నా చావుకి ముఖ్యకారకులు మంత్రిగారే... అని లెటర్లో వుండడం చూసిన చీఫ్ సెక్రటరీ ఆ లెటర్‌ని తన పాంటు జేబులో తురిమి 'పోలీస్ రిపోర్టివ్వండి. శవాన్ని పోస్టుమార్టానికి తరలించండి' అని చెప్పి వెనుతిరిగాడు.

లెటర్లో వ్రాసిపెట్టిన విషయాన్ని బైటికి పొక్కనీయదల్చుకోలేదు చీఫ్ సెక్రటరీ. మీడియాకి ఈ నిజం తెలిస్తే ఇంకేమైనా వుందా?

అప్పుడే అధికారగణమంతా నల్లబేడ్జీలు ధరించారు.

సి.యం.ని పర్సనల్‌గా కల్సిన చీఫ్ సెక్రటరీ వారి చెవిలో ఏదో రహస్యంగా వూదేడు. అందుకు తల ఆడించాడు సి.యం.

ఆకస్మిక మరణానికి గౌతమ్‌కుమార్ భార్యాపిల్లలు ఘొల్లుమన్నారు.

అధికారికంగా మరురోజు సచివాలయానికి సెలవు ప్రకటించి చేతులు దులుపుకున్నారంతా.

కుటుంబ కారణాల వల్లే ఆత్మహత్యకి పాల్పడి వుంటాడనే 'ఎలిబీ' సృష్టించటం అధికార వర్గాల్లో అలజడిని సృష్టించింది. కానీ ఎవ్వరూ నోరు మెదపటానికి సాహసించలేకపోయారు.

***

"చూసేవా సదానందం.... రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవేముంటుందని... పైవాళ్ల జోక్యం వల్ల అసలు నిజం ఎలా తారుమారైందో?.." అంటూ కథ ముగించాడు రంగారావు.

★

